నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 14 అక్టోబర్ 2024 | MEDAK

విజయదశమి అంటే చెడుపై విజయం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో దసరా వేడుకలకు హాజరు

రంగదాంపల్లిలో రావణ దహనంలో పాల్గొన్న సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 13 : ''విజయ దశమి అంటే చెడు పై విజయం సాధించడం... శ్రీరాముని చేతిలో రావణుడు ఓటమి పొందిన రోజు.. శ్రీరాముడు విజయం సాధించి రామరాజ్యం వచ్చిన రోజు ఈ విజయ దశమి అని'' మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నర్సాపూర్, రంగదాంపల్లి, రూరల్ పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో శనివారం దసరా వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..ఈ రోజు నుంచి అన్నింటా అందరూ విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మీరు అనుకున్న లక్ష్యాలు, సంకల్పం నెరవేరాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ రోజు పాల పిట్టను చూస్తే మంచి జరుగుతుంది, అందరికీ శుభం జరగాలన్నారు. అమ్మవారి దయతో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరాలని కోరుకుంటున్నానన్నారు. మీ అందరికీ మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. సిద్దిపేట అంటేనే దేశంలో ఒక ప్రత్యేకత ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘం కూడా సిద్దిపేట స్టీల్ బ్యాంకు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిందన్నారు. సిద్దిపేట జిల్లా, రైలు, మెడికల్ కాలేజ్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, గోదావరి జలాలు తీసుకువచ్చి మన దశాబ్దాల కలను నెరవేర్చుకున్నామన్నారు. మన రంగనాయక సాగర్ మూడు టీఎంసీలతో కలకలలాడుతుందన్నారు. రంగనాయకసాగర్ కింద లక్ష ఎకరాలతో రెండు పంటలు పండిస్తున్నామన్నారు. త్వరలో సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూరుకు రైలు వెళ్తుందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు రేణుకా తిరుమల్‌రెడ్డి, నాయిని చంద్రం, నాయకులు వంగనాగిరెడ్డి, అయిలయ్య, ముత్యాల కనకయ్య, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బండారు నర్సింహులు, ఎల్లం పాల్గొన్నారు.

సిద్దిపేటలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ముగిసిన త్రీరాత్రోత్సవాలు



ఆలయ కోనేరులో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న అర్చకులు

చేర్యాల, అక్టోబర్ 13 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో మూడు రోజులు నిర్వహించిన దేవీ త్రీరాత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. దుర్గామాత విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు ఆలయ కోనేరులో వేకువ జామున నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ మాట్లాడుతూ సనాతన సంప్రదాయ బద్ధంగా ఆలయంలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. మూడు రోజులు మహాగణపతిపూజ, స్వస్తిక్ వచనం, రుత్విక్ వరణం,అఖండ దీపారాధన,అంకురార్పణ, నవగ్రహారాధన, దేవతాప్రతిష్ఠ, కళషస్థాపన, చతుషష్టి ఉపచార పూజ,అగ్నిప్రతిష్ట, చండీహోమం, మూలమంత్ర హనం, పుర్ణాహుతి, సుహాసిని పూజలు చేయడంతో పాటు అమ్మవారికి ఒడిబియ్యం పోసి పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీ, స్థానాచార్యులు పడిగన్నగారి మల్లేశం, సిబ్బంది, అర్చకులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- వచ్చే వర్షాకాలం వరకు గౌరవెల్లి కాల్వల ద్వారా సాగునీటి సరఫరా
- రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, అక్టోబర్ 13: కులగణన ప్రక్రియ పూర్తయిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో దసరా సందర్భంగా శమీ పూజ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం జరిగేలా ప్రభుత్వం జీవో 18 తెచ్చిందని, 60 రోజుల్లో సంపూర్ణంగా సర్వే నిర్వహించి కులగణన పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. బీసీ కమిషన్ సూచన మేరకు కులగణన చేపడుతున్నామని, ఈ ప్రక్రియ షురూ కావడం బీసీ మంత్రిగా హర్షం వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. గడిచిన పది నెలల్లో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కోహెడ మండలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమిపూజ, హుస్నాబాద్ పట్టణానికి రూ.28కోట్లు మంజూరు, రూ.37కోట్లతో ఎల్లమ్మ చెరువు ఆధునీకరణ పనులు, రూ.4.70కోట్లతో సర్వాయి పాపన్న కోట అభివృద్ధి, అక్కన్నపేటలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు, రూ.1.75కోట్లతో ఎల్కతుర్తి కూడలి అభివృద్ధి, రూ.70కోట్లతో పీఆర్ రోడ్లు తదితర పనులు చేపట్టామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఇందుకోసం ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు వేస్తున్నదని తెలిపారు. మొదట నిరుపేదలకే ఇండ్లు వస్తాయని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం కోసం గౌరవెల్లి రిజర్వాయర్ కాల్వ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి వచ్చే వర్షాకాలం వరకు పంటలకు సాగునీరందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. గిరిజన తండాలకు పెద్ద ఎత్తున నిధులు తేనున్నట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనుల్లో పురోగతి ఉండేలా చూస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు లేకుండా ఉద్యోగులను నియమిస్తున్నామని, త్వరలోనే మెడికల్ క్యాంపులు, ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు మంజులారెడ్డి, జంగపల్లి అయిలయ్య, చిత్తారి రవీందర్, బంక చందు, అక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగూరుకు తగ్గిన వరద

వరదతో కళకళలాడుతున్న సింగూరు ప్రాజెక్టు

పుల్కల్,అక్టోబర్ 13 : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు కొన్ని రోజులుగా కొనసాగిన వరద తగ్గు ముఖం పట్టింది. ఆదివారం ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 3323 క్యూసెక్కులు కొనసాగుతుండగా,అవుట్ ఫ్లో 3323 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తి కోసం జెన్కోకు 2823 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని అధికారులు తెలిపారు.ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా,ప్రస్తుతం ప్రాజెక్టులో 29.917 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

వీడని విషజ్వరాలు

- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తగ్గని విషజ్వరాలు
- డెంగీ, టైఫాయిడ్‌తో బాధపడుతున్న జనం
- కిటకిటలాడుతున్న దవాఖానలు
- సర్కారులో వేధిస్తున్న మందుల కొరత
- సంగారెడ్డి జిల్లాలో ఈ నెలలో 23 డెంగీ కేసులు నమోదు
- మెదక్ జిల్లాలో 70 రోజుల్లో 9867 వైరల్ ఫీవర్ కేసులు

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని దవాఖానలో కిటకిటలాడుతున్న రోగులు

సంగారెడ్డి/మెదక్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలో విషజ్వరాల బెడద ఇంకా తగ్గలేదు. డెంగీ, టైఫాయిడ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో విషజ్వరాలతో రోగులు బారులు తీరుతున్నారు. ఈనెల ఇప్పటి వరకు 23 డెంగీ కేసులు నమోదయ్యాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలతో పాటు మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ దవాఖానలు, సంగారెడ్డిలోని జనరల్ దవాఖానలో డెంగీ కేసులు, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. ప్రభుత్వ దవాఖానలకు రోగుల తాకిడీ పెరుగుతున్నది. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో నిత్యం 500 నుంచి 1000 మంది వరకు అవుట్ పేషంట్స్ వస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచే సంగారెడ్డి జిల్లాలో విషజ్వరాల బెడద మొదలైంది. దోమల బెడద పెరగడం, పారిశుధ్యలోపం తదితర కారణాలతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. గ్రామాల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడనే పేరుకు పోవడంతో పాటు మురుగు కాల్వలు సరిగ్గా శుభ్రం చేయడం లేదు. గ్రామాల్లో చెత్త సేకరించి డంప్‌యార్డుకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీని సమకూర్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ట్రాక్టర్లలో డీజిల్ పోయలేని పరిస్థితి నెలకొంది. పారిశుధ్య లోపంతో దోమల బెడద పెరిగింది. పట్టణాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు విషజ్వరాలు బారిన పడుతున్నారు.ఆగస్టులో జిల్లాలో 169 డెంగీ కేసులు నమోదుకాగా, సెప్టెంబర్‌లో 165 కేసులు నమోదయ్యాయి. ఈనెల ఇప్పటి వరకు 23 డెంగీ కేసుల నమోదయ్యాయి. ఆగస్టులో 134 టైఫాయిడ్ కేసులు, సెప్టెంబర్‌లో 45, ఈనెలలో ఇప్పటి వరకు 17 మందికి టైఫాయిడ్ సోకింది. జిల్లాలో ఆగస్టులో 275 మంది డయేరియా బారిన పడ్డారు. గతనెల 309 మంది, ఈనెల ఇప్పటి వరకు 108 మందికి డయేరియా సోకి దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత రోగులను వేధిస్తున్నది. విషజ్వరాలు సోకిన వారికి చికిత్స అందజేసేందుకు అవసరమైన పలు రకాల మందులు ప్రభుత్వ దవాఖానల్లో అందుబాటులో లేవు. దీంతో రోగులు ప్రైవేట్‌కు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

మెదక్ జిల్లాలో 70 రోజుల్లో 9867 కేసులు

మెదక్ జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగ్యూ, డయేరియా, వైరల్ జ్వరాల కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆగస్టు 1వ తేదీ నుంచి అక్టోబర్ 9 వరకు 70 రోజుల్లో జిల్లాలో 9867 కేసులు నమోదయ్యాయి. జలుబు, దగ్గు, తీవ్ర జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు 20 డెంగీ కేసులు నమోదు కాగా, 277 డయేరియా కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు వెల్లడించారు. ఆ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టారు. మెదక్ జిల్లాలోని మెదక్, పొడ్చన్‌పల్లి, సర్దన తదితర ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదు కాగా, రామాయంపేట మండలం ప్రగతిధర్మారం, కొల్చారం మండలాల్లో డయేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. మెదక్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 9 వరకు ఫీవర్ కేసులు 9867, డెంగ్యూ 20,డయేరియా 277, టైఫాయిడ్ 120 కేసులు నమోదయ్యాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డెంగీ, డయేరియా, టైఫాయిడ్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఇంటి పరసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. అనారోగ్యానికి గురైతే వెంటనే సర్కారు దవాఖానల్లో చికిత్స పొందాలి. దవాఖానల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు మా సిబ్బంది కృషిచేస్తున్నారు.

–డాక్టర్ శ్రీరామ్, డీఎంహెచ్‌వో మెదక్

విషజ్వరాల కేసులు తగ్గుతున్నాయి

సంగారెడ్డి జిల్లాలో రెండు నెలలతో పోలిస్తే ప్రస్తుతం విషజ్వరాల కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ కేసులు తక్కువ సంఖ్యలో వస్తున్నాయి. డెంగీ నిర్ధారణ అయితే వెంటనే వారికి మెరుగైన చికిత్స అందజేస్తున్నాము. సంగారెడ్డి జనరల్ దవాఖానలో విషజ్వరాలు సోకినవారికి చికిత్స అందజేసేందుకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. జ్వరం లేదా విషజ్వరాలు సోకినట్లు కనిపిస్తే రోగులు ప్రభుత్వ దవాఖానకు వచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకోవడంతో పాటు చికిత్స పొందాలని సూచించారు.

–అనిల్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ సంగారెడ్డి

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

దుబ్బాక మండలం పోతారంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, అక్టోబర్13 : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తన స్వగ్రామమైన దుబ్బాక మండలం పోతారంలో దసరా పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. శనివారం గ్రామస్తులతో కలిసి పాలపిట్టను దర్శించుకుని, జంబి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం దుబ్బాకలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత నిమజ్జనంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులు, యువజన సంఘాల నాయకులు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పోతారంలో యువజన సంఘం నాయకులు నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పాడి పంటలతో రైతులు, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని దుర్గామాతను కోరుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో యువజన, కుల సంఘాల ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ శ్రేణులతో పాటు ప్రజలందరికీ ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

అంబరాన్నంటిన దసరా సంబురాలు

జహీరాబాద్ పట్టణంలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మానిక్‌రావు

జహీరాబాద్, అక్టోబర్ 13: జహీరాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా శనివారం దసరాసంబురాలు అంబరాన్నంటాయి. నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ప్రజలు విజయదశమి వేడుకలను వైభవంగా జరుపుకొన్నారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో ప్రజలు ఉదయం నుంచే చిన్నా పెద్దా అనే తేడా లేకుండా కొత్త బట్టలు ధరించి దసరా వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని భవానీమాత ఆలయంతో పాటు ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర, బడంపేట రాచన్న స్వామి, రేజింతల్ సిద్ధివినాయక, రాఘవపూర్ పంచవటీ సరస్వతీదేవి, మొగుడంపల్లి మండలం భవానమ్మ పల్లిలోని దుర్గాభవానీమాత ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జమ్మి చెట్టుకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. జహీరాబాద్ పట్టణంలోని స్టేడియంలో రావణ సంహారణ కార్యక్రమాలు ప్రజల్ని అలరించాయి. అనంతరం జమ్మి ఆకులను తెంపుకుని ప్రజలు ఒకరికొకరూ ఇచ్చిపుచ్చుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదివారం ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రతిష్ఠించిన భవానీ మాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

దుర్గామాతకు పద్మాదేవేందర్‌రెడ్డి పూజలు

మెదక్ జిల్లా కొడపాకలో దుర్గామాతకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, అక్టోబర్13: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కొడపాకలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన దుర్గామాత నిమజ్జనంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకపూజలు చేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలగౌడ్, శ్రీనాథ్‌రావు గ్రామ మాజీ సర్పంచ్ సంగప్ప పాల్గొన్నారు.

అమ్మవారిని మంజీరానదిలో మర్థనం చేయడానికి తీసుకువెళ్తున్న భక్తులు

ముగిసిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

పాపన్నపేట, అక్టోబర్ 13: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవానీమాత సన్నిధిలో తొమ్మిది రోజుల పాటు జరిగిన దేవీశరన్నరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు రాజరాజేశ్వరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేదబ్రాహ్మణులు గుమ్మడికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోకుల్‌షెడ్ నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. దుర్గామాతకు జై అంటూ శోభాయాత్ర కొనసాగింది. దుర్గమ్మ ఆలయం ఎదుట మంజీరానదిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మర్థనం చేశారు.

జనారణ్యంగా ఏడుపాయల

ఎల్లలు దాటి తరలివచ్చిన భకులతో ఆదివారం ఏడుపాయల కిటకిటలాడింది. గర్భగుడిలోని అమ్మవారిని దర్శించుకొని బోనాలు తీసి ఒడిబియ్యం సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలు వేల సంఖ్యలో తరలిరావడంతో సత్రాలు దొరకక చెట్ల కింద టెంట్లు వేసుకొని విందులు చేసుకున్నారు.

నీటి కలుషితం ప్రభుత్వ నిర్లక్ష్యమే

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నారాయణఖేడ్ ఏరియా దవాఖానలో బాధితుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబర్ 13: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్‌లో కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి చెందడంతో పాటు వందమందికి పైగా అస్వస్థతకు గురికావడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సంజీవన్‌రావుపేట్ గ్రామాన్ని సందర్శించి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు గ్రామంలో పరిస్థితి పై ఆరా తీశారు. కలుషిత నీటికి కారణమైన బావిని పరిశీలించి స్థానికంగా చికిత్స పొందుతున్న వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అస్వస్థతకు గురైన వారి వివరాలు వెల్లడించడంలో ఎందుకు జంకుతున్నారని వైద్యులపై మండిపడ్డారు. విజయదశమి పండుగ సమయంలో గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా చేయలేని దుస్థితిలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఉన్నారన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకాన్ని సక్రమంగా నిర్వహించక పోవడంతో ప్రజలకు శాపంగా మారిందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున, అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న వారికి ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు నారాయణఖేడ్ ఏరియా దవాఖానను సందర్శించి సంజీవన్‌రావుపేట్ బాధితుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని డీసీహెచ్ఎస్ సంగారెడ్డి, స్థానిక సూపరింటెండెంట్ రమేశ్‌లకు సూచించారు.